సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం, 9, సెప్టెంబర్, 2023



నేడు జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. 8లో ▸



ఘనంగా సామూహిక వ్రతాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. 8లో ▸

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్



భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫెన్సింగ్ సెలెక్షన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. 8లో

న్యూస్‌రీల్

విధ్వంసాలు సృష్టించేలా లోకేశ్ పాదయాత్ర

వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి



పాలకొల్లు అర్బన్: యువగళం పేరుతో నారా లోకేశ్ నిర్వహిస్తున్న పాదయాత్రలో విద్రోహాలు, విధ్వంసాలు సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర అంటే ప్రజలకు ఏ మేలు చేస్తారో చెప్పాలే కాని, కార్యకర్తల్ని రెచ్చగొట్టి అల్లర్లు చేయడం సరికాదన్నారు. పాదయాత్రలో లోకేశ్‌కి మాట్లాడటానికి గళం లేదని, వెంట నడవడానికి దళం లేదని ఎద్దేవా చేశారు. ఖాళీ బిందెలతో ప్రదర్శన చేసి డ్రామాలు చేయడం ఎమ్మెల్యే నిమ్మలకు కొత్తకాదని దుయ్యబట్టారు. ఆయన డ్రామాలకు త్వరలోనే చెక్ పెడతామని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేయడానికి, సీఎం జగన్‌ను ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు, అల్లర్లు సృష్టించినా విజయం జగన్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని ఏ నాయకుడూ చేయని విధంగా సీఎం జగన్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు, రామానాయుడు ప్రజల నుంచి అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ఇంటికి అప్పు పత్రాలు ఇచ్చి ప్రజల్ని రుణగ్రస్తులను చేశారన్నారు. పాలకొల్లులో ఇప్పటికే 1,856 టిడ్కో ఫ్లాట్లు అప్పగించామని, దీనికి ప్రభుత్వం ఎల్అండ్‌టీకి రూ.16 కోట్లు చెల్లించిందన్నారు. త్వరలోనే మరో రెండు వేల మందికి ఫ్లాట్‌లు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అనుబంధ రహదారులను తీర్చిదిద్దాలి : కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని జాతీయ రహదారులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ అధికారులతో ఆమె జాతీయ రహదారులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు పూర్తయి అనుబంధంగా ఉన్న రోడ్ల మార్గాలను తీర్చిదిద్దాలని కోరారు. నరసాపురంలో ఎన్‌హెచ్‌కి అనుకుని ఉన్న సుమారు 15 మార్గాలను తీర్చిదిద్దాలన్నారు. నరసాపురం బైపాస్ ఏర్పాటుకు భూసేకరణ పనులు పూర్తయ్యాయని, త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. శృంగవృక్షం ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని, దీనికి అనుబంధంగా పనులను చేపట్టాలని ఆదేశించారు. ఉండి, మేడపాడు-నరసాపురం రహదారుల నిర్మాణాలకు భూసేకరణ అవార్డులను వెంటనే పాస్ చేయాలని ఆదేశించారు. సీతారాంపురం-కాళీపట్నం మధ్య నేషనల్ హైవేకు అనుకుని కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని ఎన్‌హెచ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సీఆర్ఎఫ్ కింద పెద్ద కాపవరం, చిన్న కాపవరం ప్రాంతాల్లో మంజూరైన రెండు రోడ్ల నిర్మాణాలకు ముందుగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌హెచ్-216ఏ పీడీ డి.సురేంద్రనాథ్, పీఎం కె.బాలసుబ్రమణ్యం, డీపీఎం కె.శ్రవణ్‌కుమార్, ఎన్‌హెచ్ 165 డీఈ ఎం.శ్రీనివాసరావు, కాకినాడ ఎన్‌హెచ్ డీఈ ఎల్ఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఆర్అండ్‌బీ అధికారి బి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఓటర్ల జాబితా తయారీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లు పునః పరిశీలన, విచారణ ప్రక్రియ పూర్తయ్యిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై పలు అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పక్కాగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టరు చెప్పారు. ఎన్నికల సంఘ ఆదేశాలతో మరోసారి పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ చేపట్టామన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదుల మేరకు ఓట్ల పునః పరిశీలన చేశామన్నారు. క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన, విచారణ తదుపరి మృతులు, శాశ్వత వలసలు, తదితర కారణాలతో ఉన్నవారిని తొలగించామన్నారు. పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావచ్చన్నారు. కొత్తగా లంకలో ఒకటి, భీమవరం టిడ్కో హౌసింగ్ వద్ద మరొకటి రెండు పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదలను పంపామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం గోడౌన్ మార్పుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఎన్నికల సూపరింటెండెంట్ లక్కు నరసింహారావు, కామన నాగేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), కోమటి రవికుమార్ (బీజేపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), జేఎస్‌వీ గోపాలన్ (సీపీఐఎం), కె.కరుణాకర్ (బీఎస్పీ) పాల్గొన్నారు.

యువగళం.. దాడుల పర్వం

- ప్రతిచోటా రెచ్చగొట్టే ప్రసంగాలు
- ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రిపై అడ్డగోలు విమర్శలు
- నూజివీడు, మండలపాక, భీమవరంలో విధ్వంసకాండ
- ముగ్గురు పోలీసులతో సహా 16 మందికి గాయాలు
- ఉమ్మడి పశ్చిమలో ముగిసిన లోకేశ్ పాదయాత్ర





భీమవరం ఇందిరమ్మ కాలనీలో దాడులు చేస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్), దాడిలో గాయపడిన బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కవ్వింపు చర్యలు.. అడ్డగోలు రీతిలో అసభ్యపద జాలంతో దూషణలు.. అనంతరం దౌర్జన్యాలు.. ప్రశ్నిస్తే దాడులు.. ఇది తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాగిన తీరు. జిల్లాలోకి ప్రవేశించినప్పటి నుంచి ప్రతిచోటా లోకేష్ రెచ్చగొట్టేలా ప్రసంగించడం, యువగళం వలంటీర్లు రోడ్లపై అధికార పార్టీ ఫ్లెక్సీలు కనిపిస్తే చించివేయడం, రాళ్లు విసరడం, దాడులకు తెగబడుతూ జిల్లాలో మొదటి విడత యాత్ర ముగించారు. లోకేష్ పాదయాత్రగా గత నెల 24వ తేదీన నూజివీడు నియోజకవర్గం మీర్జాపురంలో ప్రవేశించి ఏలూరు జిల్లాలో యాత్ర ప్రారంభించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 16 రోజుల పాటు గోపాలపురంతో సహా 9 నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజలను కలిసి కరచాలనం చేసి, కష్టసుఖాలు వినడం, ప్రతిఒక్కరినీ ఆత్మీయంగా పలకరించడం ఇలాంటి వాటికి దూరంగా భారీ సొంత రక్షణ వలయం ఏర్పాటు చేసుకుని చేతులు ఊపుకుంటూ వేగంగా.. మొక్కుబడిగా యాత్ర నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, స్థితిగతులు పట్టించుకోకుండా సభలు పెట్టించడం, భారీగా ఖర్చు పెట్టి జనాలను రప్పించడం, అడ్డగోలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యేలను దూషించడమే అజెండాగా యాత్ర సాగించారు. మొక్కుబడిగా సాగిన యాత్రను కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కేడర్ కూడా చాలా లైట్‌గా తీసుకోవడంతో చాలాచోట్ల పేలవంగా ముగిసింది. యువగళం యాత్రకు జనసమీకరణ కూడా టీడీపీ శ్రేణులకు ప్రయాసగా మారింది.

ఖర్చు చేసినా ఫలితం శూన్యం

నూజివీడు, చింతలపూడి, పోలవరం, గోపాలపురం, ఉంగుటూరు, ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో లోకేశ్ పాదయాత్ర సాగింది. టికెట్ ఆశిస్తున్న ఆశావహులకు, నియోజకవర్గ సమన్వయకర్తలకు ఖర్చులను విభజించి అప్పగించారు. బహిరంగ సభకు జనసమీకరణ ఖర్చుల బాధ్యతలు ఒకరికి, నియోజకవర్గంలో ఎన్ని రోజులు యాత్ర సాగితే అన్ని రోజులు రెండు పూటలా జనం ఉండేలా జనసమీకరణ చేసే బాధ్యత మరొకరికి అప్పగించారు. అయితే ఎక్కువ నియోజకవర్గాల్లో జనసమీకరణ విషయంలో నేతలు పెద్దగా పట్టించుకోకపోవడంతో మొక్కుబడిగానే యాత్ర సాగింది.

దాడులు.. దౌర్జన్యాలు

- ప్రతి నియోజకవర్గంలోనూ యువగళం బ్యాచ్ రెచ్చిపోయారు. గత నెల 25న నూజివీడు నియోజకవర్గంలోని తుక్కులూరు గ్రామంలో రోడ్డుపై వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని ఉన్న అభిమానిపై 20 మంది యువగళం వలంటీర్లు దాడి చేసి గాయపరిచారు.
- చింతలపూడి పాదయాత్ర చేరుకోగానే అధికార పార్టీ ఎమ్మెల్యే ఎలీజా కార్యాలయం వద్ద సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండటంతో ఎమ్మెల్యే కార్యాలయంలోని కార్యకర్తలు, స్థానికులు బయటకు వచ్చి జై జగన్ నినాదాలు చేశారు. దీంతో వారిపైకి వెళ్లేందుకు సమాయత్తమవుతుండగా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఘర్షణకు తావులేకుండా ముగిసింది.
- ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం మందలపర్రు చర్చి సెంటరులో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చూసిన యువగళం సభ్యులు రెచ్చిపోయి రాళ్లు విసిరారు. స్థానిక యువకుడు, జనాలు ఇదేమి పద్ధతి అని ప్రశ్నించడంతో యువగళం వలంటీర్లు దాడి చేశారు. దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు.
- యువగళం బృందం భీమవరంలో విధ్వంసకాండ సాగించింది. భీమవరం ప్రధాన సెంటరులో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీపై రాళ్లు, సీసాలు విసిరారు. అనంతరం ఇందిరమ్మకాలనీకి చేరుకోగానే అక్కడ వైఎస్సార్ సీపీ అభిమానులు, స్థానికులపై యువగళం బృందం రెచ్చిపోయింది. రాళ్లు, కర్రలు, రాడ్లతో కొంతసేపు విధ్వంసం సృష్టించి ఇళ్లల్లోకి చొరబడి మరీ దాడులు చేశారు. ముగ్గురు పోలీసులకు, 13 మంది సామాన్యులకు గాయాలయ్యాయి. ఇలా ప్రతిచోట అధికార పార్టీ ఫ్లెక్సీని చూస్తే దాడులు, దౌర్జన్యాలు చేసుకుంటూ లోకేష్ యాత్ర సాగిస్తున్నారు.

స్పందన లేక దాడులు



యువగళం పాదయాత్రకు స్పందన లేకపోవడంతో తీవ్ర అసహనంతో సంచలన దాడులు చేస్తున్నారు. భీమవరం ఘటనలో 44 మంది యువగళం వలంటీర్లను పోలీసులు అరెస్టు చేశారు. 13 మంది నేతలపై కేసులు నమోదు చేశారు. దీనిపై పోలీసు శాఖ సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తుంది. ప్రశాంత భీమవరంలో విధ్వంసం సృష్టించిన లోకేశ్ కనీసం పల్లెత్తు మాట్లాడకుండా వెళ్లిపోవడం సిగ్గుమాలిన చర్య.

– గ్రంధి శ్రీనివాస్, భీమవరం ఎమ్మెల్యే

‘జగనన్నకు చెబుదాం’తో
సత్వర పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



యలమంచిలిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

యలమంచిలి: జగనన్నకు చెబుదాం ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇకపై ప్రతి శుక్రవారం, బుధవారం మండల స్థాయిలో జిల్లా అధికారులతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో యలమంచిలిలో తొలి మండలస్థాయి కార్యక్రమం శుక్రవారం చేపట్టామన్నారు. ప్రజల నుంచి 103 అర్జీలకు స్వీకరించారు. వీటిలో 16 అర్జీలు జిల్లాస్థాయివి కావడంతో వాటిని భీమవరం తీసుకెళ్లారు. మిగిలిన 87 అర్జీలు మండల అధికారులకు అప్పగించారు. వీటిలో రెవెన్యూ 26, పంచాయతీరాజ్ 14, ఇంజనీరింగ్ 9, స్కూల్ ఎడ్యుకేషన్ 5, వైద్యశాఖ 5, డ్వాక్రా 5, ఆర్‌డబ్ల్యూఎస్ 4, ఆర్అండ్‌బీ 4, హౌసింగ్ 4, విద్యుత్ 4, పోలీస్ 2, సివిల్ సప్‌లైస్ 1, ఐసీడీఎస్ 1, ఆర్టీసీ 1, వ్యవసాయం 1, కో-ఆపరేటివ్ 1 అర్జీలు ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి, నరసాపురం ఇన్‌చార్జి ఆర్డీఓ కె.కృష్ణవేణి, డీఎల్డీఓ కేసీహెచ్ అప్పారావు, యలమంచిలి మండల ప్రత్యేక అధికారి, గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ, ఎంపీపీ రావూరి వెంకటరమణ, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన భర్త మరో మహిళను వివాహం చేసుకుని, తనకు అన్యాయం చేశాడని న్యాయం చేయాలని అడవిపాలెం గ్రామానికి చెందిన సిర్రా లావణ్య అర్జీ అందజేశారు.
- యలమంచిలి, యలమంచిలిలంక గ్రామాల్లో గోదావరి తీరంలోని కొన్ని జిరాయితీ వ్యవసాయ భూములు నదీపాతంలో ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నాయని, వీటిని నదీపాతం నుంచి తీసివేయాలని రైతులు అర్జీ ఇచ్చారు.
- కనకాయలంక మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు అర్జీ అందజేశారు.
- పాలకొల్లు నుంచి గంగడుపాలెం గ్రామానికి (వయా నారినమెరక, మట్లపాలెం) ఆర్టీసీ బస్సు మూడో ట్రిప్ వేయాలని మూడు గ్రామాల సర్పంచ్‌లు అర్జీ ఇచ్చారు.

వచ్చేనెల నుంచి ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ వచ్చేనెల నుంచి ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని జిల్లా నియామక కమిటీ ద్వారా ఎంపిక చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలకు సాంకేతిక సహాయకుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీరి కాలవ్యవధి రెండు నెలల పాటు ఉంటుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక నిరంతర ప్రక్రియ

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక బాలగంగాధర తిలక్ మున్సిపల్ ఆడిటోరియంలో శుక్రవారం తణుకు మున్సిపాలిటీ, తణుకు మండలానికి సంబంధించి నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛనుకు ఏ ఒక్కరు అర్హత సాధించినా వారి వివరాలను వలంటీర్లు సేకరించి అప్‌లోడ్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు అవుతున్నాయన్నారు.

కొత్తగా మరో 2 వేల పింఛన్లు

తణుకు నియోజకవర్గంలో పాత పింఛన్లకు ప్రతి నెలా రూ.10 కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తుండగా కొత్తగా రెండు వేల పింఛన్లు మంజూరు చేసి లబ్ధి అందిస్తున్నట్టు మంత్రి కారుమూరి చెప్పారు. ఇటువంటి సంక్షేమం ఒక చారిత్రాత్మకం అని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షలకు పైగా రేషన్ కార్డులు, లక్షకు పైగా పింఛన్లు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎవరైనా పింఛనుదారుడు మరణించిన సందర్భంలో మాత్రమే కొత్తవారికి ఆ పింఛను మంజూరయ్యే పరిస్థితి ఉండేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ‘దోచుకో దాచుకో పంచుకో’ అనే రీతిలో ఉండటం వల్లే పేదలకు సంక్షేమం అందేది, కాదని, అయితే ఇప్పుడు ప్రతి రూపాయి ప్రజలకు పారదర్శకంగా చేరుతుందన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పేదవర్గాలకు పింఛను ద్వారా సీఎం జగన్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే దఫదఫాలుగా పింఛను పెంచుతూ రూ.2,750 చొప్పున అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ చేతులమీదుగా కొత్త పింఛన్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జెడ్పీటీసీ ఎం.అన్నపూర్ణాదేవి, ఎంపీపీ ఆర్.ధనరాజు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, తణుకు మండల మహిళాధ్యక్షురాలు శ్యామల, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, నున్న దుర్గాప్రసాద్, డీజే అమూల్యారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలపై స్టే

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కమిటీ 2024 వరకు విధులు నిర్వహిస్తుందని, ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వారు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ‘సాక్షి’తో మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభకు ఎటువంటి సంబంధం లేని మాజీ అధ్యక్షుడు ఒకరు ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల కన్వీనర్‌గా పేర్కొంటూ, ఎన్నికలు అంటూ సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో ఎన్నికలంటూ పేర్కొంటున్నారని, ఈ ప్రకటనలు ఆర్యవైశ్య మహాసభ బైలాకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆర్యవైశ్యులను తప్పుదోవ పట్టించేలా ఉన్న ప్రకటనలను తాము ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రకటనల నేపథ్యంలో తాము కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. కోర్టు సైతం ఆర్యవైశ్య మహాసభ బైలాకు విరుద్ధంగా ఉన్నందున ఎన్నికల ప్రక్రియపై స్టే ఇచ్చిందని వివరించారు. మహాసభ ఔన్నత్యానికి మచ్చతెచ్చేలా కొందరు చేపడుతున్న ఈ చర్యల పట్ల ఆర్యవైశ్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 10, 11 తేదీల్లో జరిగే ఎన్నికలకు ఎవరూ హాజరుకావద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న కమిటీ 2024 మార్చి వరకు కొనసాగుతుందని, అనంతరం రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. తాము అధికారికంగా ప్రకటించేంత వరకు ఎటువంటి ఎన్నికలూ జరగవని స్పష్టం చేశారు.

ఆశాజనకంగా సార్వా

- ఏపుగా వరి పొలాలు
- ఆర్‌బీకేల్లో సమృద్ధిగా ఎరువులు
- పొటాష్ వాడాలని అధికారుల సూచన



వీరవాసరం మండలం తోకలపూడిలో సార్వా వరిపైరు

సాక్షి, భీమవరం: జిల్లాలో సార్వా వరిపైరు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత దాళ్వా సీజన్‌లో అకాల వర్షాలతో కొంత ఇబ్బంది పడిన రైతులు సార్వాపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో దాదాపు 2.13 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తుండగా ముందుగా నాట్లు వేసి తాడేపల్లిగూడెం, తణుకు, ఇరగవరం, అత్తిలి, పెంటపాడు పాలకొల్లు మండలాల్లో పైరు చిరుపొట్ట దశకు చేరుకుంది. దీంతో రైతులు ఎరువులు, పురుగు మందులు వేస్తున్నారు. సార్వా సీజన్ ప్రారంభంలో సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేయడంలో తీవ్ర జాప్యం జరిగింది. అయినా రైతులు శ్రమించి నాట్లు పూర్తిచేశారు. నాట్లు వేసిన నాటి నుంచి ఎప్పటికప్పుడు సకాలంలో ఎరువులు వేస్తూ పైరును పెంచి పోషిస్తున్నారు. దీంతో వరిపైరు ఆశాజనంగా కనిపిస్తోంది.

అందుబాటులో ఎరువులు

వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగానే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను సిద్ధం చేయడంతో రైతులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నారు. ఆర్‌కేబీల్లో తక్కువ ధరకు ఎరువులు లభించడంతో రైతులు ముందుగానే సొమ్ములు చెల్లించి ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.


పొటాష్‌తో మేలు

ఏపుగా పెరుగుతున్న వరిపైరుకు చిరుపొట్ట దశలో పొటాష్ ఎరువు వేయాలని వ్యవసాయశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఎకరాకు 25 కిలోల పొటాష్, 20 కిలోల యూరియా కలిపి వాడటం వల్ల గింజలు గట్టిబడి ధాన్యం ముక్కయ్యే ప్రమాదం ఉండదని.. తద్వారా మంచి దిగుబడి సాధించవచ్చునని చెబుతున్నారు. గత దాళ్వా సీజన్‌లో ఎండ తీవ్రతతో ధాన్యంలో నాణ్యత లోపించడంతో మిల్లర్లు తీసుకోవడానికి ఇబ్బంది పెట్టారు. ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా పైరు చిరు పొట్టదశలో పొటాష్, యూరియా కలిపి వాడాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది.

పురుగు మందులు వాడొద్దు

ప్రస్తుతం వరి పైరుపై చీడపీడలు లేకపోవడతంతో పురుగు మందులు పిచికారీ చేయాల్సి అవసరం లేదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వరి పంటకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు.

పొటాష్ తప్పనిసరి



సార్వా వరిపైరుకు చిరుపొట్ట దశలో పొటాష్ వేయడంతో ప్రయోజనం ఉంటుంది. పొటాష్ వల్ల గింజలు పూర్తిగా గట్టిబడి మంచి దిగుబడి వస్తుంది. అలాగే ధాన్యం గింజలు ముక్క అయ్యే ప్రమాదం ఉండదు. ప్రస్తుతం వరిపైరు ఆశాజనకంగా ఉంది. పైరుపై ఎటువంటి చీడపీడల సమస్య లేనందున అనవసరంగా పురుగు మందులు వాడొద్దు. పక్క రైతులను చూసి పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల అధిక పెట్టుబడి మినహా ఎటువంటి ప్రయోజనం ఉండదు. పంటలో ఏదైనా సమస్య ఉంటే స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, భీమవరం

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


మృతుడు బొప్పన నరేష్

తాడేపల్లిగూడెం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో కడకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి శుక్రవారం ఒక యువకుడు మృతిచెందాడు. మృతుడి వద్ద ఉన్న బ్యాగ్‌లో సర్టిఫికెట్లను పరిశీలించగా.. అతను చింతలపూడి మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నన్నయ్య విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసినట్టు సర్టిఫికెట్లలో ఉంది. రైల్వే ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీ సత్యం–అహింసా విధానాలు నాడు–నేడు అంశంపై డ్రాయింగ్ షీట్‌పై చిత్రాన్ని వేసి స్కాన్‌చేసి పంపించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. చిత్రాలను ఈనెల 20లోపుగా పంపించాలని ఇతర వివరాలకు 99490 93115 నెంబరులో సంప్రదించాలన్నారు.

భీమవరంలో నేడు ఫెన్సింగ్ పోటీల సెలెక్షన్స్

సాక్షి, భీమవరం: కాకినాడ జెడ్పీ హాల్లో రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌పీ కృష్ణమోహన్ చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫెన్సింగ్ సెలెక్షన్స్ శనివారం భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. చైల్డ్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2015–16 మధ్య, మినీలో పాల్గొనే క్రీడాకారులు 2013–15 మధ్య జన్మించినవారై ఉండాలన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.ఇతర వివరాలకు 63042 52121, 96802 34566 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వ్రత వేడుకలో అమ్మవారికి హారతులిస్తున్న అర్చకులు, మహిళా భక్తులతో నిండిన అనివేటి మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. శ్రావణమాసంలో నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో దేవస్థానం నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 12 వందల మందికి పైగా మహిళలు ఈ వ్రత వేడుకలో పాల్గొని, వరలక్ష్మీ దేవిని కొలిచారు. తొలుత విశేషంగా అలంకరించిన అమ్మవారిని ఆలయం నుంచి తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివెట్టి మండపం వద్దకు వెండి తొళక్క వాహనంపై తీసుకొచ్చి, అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేంచేపు చేశారు. ఆ తరువాత అర్చకులు, పండితులు అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సతీమణి భాగ్యలక్ష్మి అమ్మవారికి పూలు, పండ్లను అందజేయగా, వ్రత వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ దేవస్థానం అందించిన పూజాసామగ్రితో, వేదిక ముందు కూర్చున్న మహిళలతో అర్చకులు, పండితులు, పురోహితులు, ఆగమ విద్యార్థులు ఈ వ్రత వేడుకను కన్నులపండువగా జరిపించారు. శ్రీవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చిన మహిళా భక్తులు సైతం ఈ వ్రతాన్ని ఆచరించారు. ఇందులో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, అలాగే రవికలు, ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. ఎంతో భక్తి ప్రపత్తులతో జరిగిన ఈ వ్రత వేడుకలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు మానుకొండ సుబ్బారావు, ఆచంట అనసూయ సురేష్ దంపతులు, ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, రావిపాటి లక్ష్మణస్వామి, సూపరింటిండెంట్ వాసు, సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను, ఎలక్ట్రికల్ ఏఈ అమాం శివ తదితరులున్నారు.

కొత్తగా 2 లక్షల రేషన్ కార్డుల పంపిణీ

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్ : రాష్ట్రంలో అర్హులైన పేదలకు కొత్తగా 2 లక్షల రేషన్‌కార్డులు అందజేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం మండపాకలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవం, గ్రామంలోని వెలమ, నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ అధ్యక్షత వహించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మన జిల్లాకు కొత్తగా 8 వేల రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు, రైతులకు రుణ మాఫీ చేస్తామనని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాలు పాలన చేసినా రుణ మాఫీ చేయక పోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా డ్వాక్రా మహిళలు, రైతుల రుణాలు మాఫీ చేశారని చెప్పారు. ఓటు లేని విద్యార్థుల కోసం నాడు నేడు కార్యక్రమంలో రూ. 65 వేల కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, డిజిటల్ క్లాస్ రూంలు, యూనిఫాం, జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో ఒక్క మండపాకలోనే రూ. 61 కోట్ల అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించగా, గతంలో కేవలం రూ.5 కోట్ల విలువైన పథకాలు మాత్రమే అందించారని చెప్పారు.


మండపాకలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

15 నుంచి ఇంటింటికి వైద్యులు

ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి వైద్య సేవల పేరుతో వైద్యులు ఇంటింటికి రానున్నట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీటీసీలు కాళ్ల సన్యాసిరావు, వేల్పూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తి తదితరులు పాల్గొన్నారు. మంత్రి కారుమూరిని మండపాక గ్రామానికి చెందిన రైతులు ఘనంగా సత్కరించారు.

● గడపగడపకు సంక్షేమం


పెంటపాడు : మండలంలోని యానాలపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

నేడు జాతీయ లోక్ అదాలత్

33 బెంచీల ఏర్పాటు


జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9న కోర్టులున్న అన్ని ప్రదేశాలలో జాతీయ లోక్ అదాలత్‌ను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో శుక్రవారం ఆమె మాట్లాడారు. రాజీయోగ్యమైన అన్ని కేసుల పరిష్కారం నిమిత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 33 బెంచీలు ఏర్పాటు చేయగా వీటిలో ఒక్క ఏలూరులోనే 8 బెంచీలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,952 వరకూ రాజీ యోగ్యమైన కేసులు గుర్తించామని.. వీటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులు మరో 2,746 కేసులను గుర్తించామన్నారు. ఇంత వరకూ పలు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించి 381 కేసులు పరిష్కరించామన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బుల్లి కృష్ణ మాట్లాడుతూ ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. కాంపౌండ్ ఫీజు చెల్లించి 10 లీటర్ల లోపు ఉన్న కేసులను నిబంధనలకు లోబడి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఫోన్ పే చేశామని చెప్పి మోసగించిన యువకులు


కుక్కునూరు: టెక్నాలజీని ఉపయోగించుకొని కొందరు కేటుగాళ్లు కొత్త రకం దోపిడీకి తెగబడుతున్నారు. ఫోన్ పే చేస్తాం డబ్బులివ్వాలని కోరి ఫోన్‌పే చేయకుండానే చేసినట్టు మెసేజ్ చూయించి పెట్రోల్ బంక్ సిబ్బందిని బురిడి కొట్టించారు. మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఈ ఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముగ్గురు యువకులు కుక్కునూరు పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది వద్దకు వెళ్లి తమ కుటుంబసభ్యులకు ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రికి వెళ్లాలని మూడువేలు ఫోన్‌పే చేస్తాం డబ్బులు కావాలని బతిమిలాడారు. నిజమేనని నమ్మిన పెట్రోల్ బంక్ సిబ్బంది వారి ఫోన్‌పే నెంబర్ ఇచ్చారు. దీంతో ఫోన్ పే నుంచి రూ.3 వేలు కొట్టినట్టు చూపిన యువకులు సిబ్బంది వద్ద మూడు వేలు తీసుకొని నెమ్మదిగా జారుకున్నారు. ఆ తరువాత ఫోన్ పే తెరచి చూసిన సిబ్బందికి వారి ఖాతాలో డబ్బు జమకాలేదు. మోసపోయమని గ్రహించిన సిబ్బంది తలలు పట్టుకున్నారు.

13న డీఎన్నార్‌లో జాబ్ మేళా

సాక్షి, భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) చెప్పారు. శుక్రవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన పేరొందిన సంస్థలు పాల్గొంటాయని ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా ఎంపికలు జరుగుతాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాలో పది నుంచి ఇంజినీరింగ్ వరకు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా బలుసులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఫిజియోథెరపీతో మానసిక వికాసం


భవిత కేంద్రంలో పిల్లలకు ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: దివ్యాంగులచే నిత్యం ఫిజియోథెరపీ చేయించడం ద్వారా వారిలో మానసిక వికాసం కలుగుతుందని,వారి పనులు వారు చేసుకోగలరని పిజియోథెరపిస్ట్ అల్లు శ్రీకృష్ణమహేష్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావుపేట మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్.కె.బాల ఈశ్వరయ్య, మేరీ వజ్రమ్మ, రామలక్ష్మి, ఇందిరా కుమారి, ప్రత్యేక ఉపాధ్యాయిని చంద్రకుమారి పాల్గొన్నారు.

రైల్వేలో ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


తణుకు రైల్వే స్టేషన్‌లో సేఫ్టీ సెమినార్‌లో మాట్లాడుతున్న సేఫ్టీ ఆఫీసర్ శ్రీనాథ్

తణుకు అర్బన్: రైల్వే శాఖలో విధినిర్వహణలో ఉండే ప్రతి ఒక్కరూ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ జె.శ్రీనాథ్ సూచించారు. తణుకు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సేఫ్టీ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రైల్వే ప్రాంగణాల్లో తీసుకోవాల్సిన భద్రతపై నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ముఖ్యంగా ప్రమాదాలకు సంకేతాలు తెలిపే ప్రతి చర్యను ఉద్యోగులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కౌన్సిలర్స్ సత్యనారాయణ, రామకృష్ణ, పీఎస్ మూర్తి, తణుకు, నరసాపురం స్టేషన్ మేనేజర్లు ఎన్‌వీఆర్ ప్రభాకరరావు, సీహెచ్ దివాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి వీరగాథ 3.0 సర్టిఫికెట్ల ప్రదానం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రధానమంత్రి వీరగాథ 3.0 పేరిట ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఎనిమిదవ తరగతి విద్యార్థినులు వీరమళ్ల పద్మశ్రీ,, యెగ్గిన పూర్వజ లక్ష్మి, మైనం ప్రదీప్తి, సంకు అమ్ము, కోట వైష్ణవి, కీర్తి (7వ తరగతి), ఆరవ తరగతికి చెందిన విద్యార్థినులు మైనం జ్యోతి వెంకటమాధురి, మైనం మధుప్రియ, ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఆకుల సత్య దుర్గ (పెయింటింగ్)లకు ప్రశంసా పత్రాలు లభించాయని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు.

సుజాతకు అభినందనలు

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశాఖ పట్టణంలో అవార్డును అందుకున్న ఉద్యాన వర్సిటీ వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.రఘుపతి వెంకటసుజాత అవార్డుతో శుక్రవారం వీసీ టి.జానకీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం ఉద్యానవర్సిటీకి గర్వకారణమని వీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీస్టడీస్ ఎస్.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక తణుకు రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న ముత్యగర్ల రాజ్యలక్ష్మిని శుక్రవారం వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో రాజ్యలక్ష్మి స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పట్టణ ఎస్సై జిజె ప్రసాద్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడులో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం


యానాలపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. టీడీపీ యువగళం పేరుతో రాష్ట్రంలో ఆరాచకాలు సృష్టిస్తోందని ఆరోపించారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెంటపాడు మండలంలోని యానాలపల్లి, పరిమెళ్ల గ్రామాల్లో శుక్రవారం మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసారు. జగనన్న పథకాలు ప్రజలకు సరిగా అందుతున్నాయో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటే యువగళం పేరుతో నారా లోకేష్ పాతయాత్ర పేరుతో రక్తపాత యాత్ర చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ బ్యానర్ కనిపిస్తే చాలు వాటిని చింపేయమని యువగళం ముసుగులో ఉన్న బౌన్సర్లకు చెబుతున్నారన్నారు. ఇదేంటి అని అడ్డుకొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో కొట్టిస్తున్నారన్నారు. తెలుగుదేశం ఏ స్థాయిలో దిగజారిపోయిందో ఈ విషయం ప్రజలు గుర్తించాలన్నారు. 14 ఏళ్లగా సీఎంగా చేసిన చంద్రబాబు వ్యక్తిగ స్వార్థంలో దుర్మార్గమైన ఆలోచనతో దుష్టపన్నాగం పన్నుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్న సంగతిని చంద్రబాబు, పవన్‌లు గుర్తుంచుకోవాలన్నారు. యువనేత కొట్టు విశాల్, యానాలపల్లి, పరిమెళ్ల గ్రామ సర్పంచ్‌లు గోకా ఛాయాదేవి, గొర్రెల కోటేశ్వరరావు, ములగాల బాబ్జీ, రెడ్డి సూరిబాబు, బొమ్మినాయుడు, డోకల రాము, మిరియాల బాస్కరరావు, శేషు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు పార్టీ నాయకులు బోణం వీరయ్య, కోసూరి వెంకట్రాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, దేవ వెంకటరమణ, ఎస్సీ నాయకులు డెక్కపాటి రమణ, మండా శివ, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ రాజ్ ఏఈ నవీన్, ఏవో సారథి, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

తాడేపల్లిగూడెం: సంక్షేమ పథకాల అమలు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గడచిన నాలుగన్నరేళ్లుగా కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘ నాయకులు శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన సందర్భంలో ఆయన మాట్లాడారు. పేదరికం, అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. భవన నిరాణ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, దూలం ప్రసాద్, మండా సూరిబాబు, బాతు నాగేశ్వరరావు ఉన్నారు.

బుచ్చి కర్మాగారంలో దళితుల నిరసన దీక్షలు


దీక్షలు చేస్తున్న దళిత నాయకులతో మాట్లాడుతున్న కార్మిక శాఖ అధికారులు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని బుచ్చి కర్మాగారంలో జూలై నెలలో జరిగిన ప్రమాదంలో గాయపడి కాలును కోల్పోయిన మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన బాధిత కుటుంబం కర్మాగారం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. శుక్రవారం మండపాకలో బుచ్చి కర్మాగారం ఎదుట గుమ్మంపాడుకు చెందిన భాదిత కుటుంబాన్ని కర్మాగారం యాజమాన్యం ఆదుకోవాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గొల్లపల్లి అంబేడ్కర్, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్ కుమార్, తాతపూడి బోస్, గొల్లపల్లి వివేకానంద, వైఎస్ఎస్ సింగ్, ఊదుమూడి ప్రసాద్, యాళ్ల స్వామి, రాయుడు దర్మారావు, బుంగా పద్మారావు, కొమ్మర రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆర్బీకేల ద్వారానే రైతులకు సకల సౌకర్యాలు
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


మండపాకలో రైతులకు ట్రాక్టర్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌లు

తణుకు టౌన్: గ్రామ స్థాయిలోనే రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై అందించే వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 1632 మంది రైతులకు రూ. 30 కోట్ల 92 లక్షల విలువైన వ్యవసాయ ఉపకరణాలను రూ. 11 కోట్ల 54 లక్షల సబ్సిడీపై పంపిణీ చేసినట్లు తెలిపారు. కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, గడ్డి యంత్రాలు, పవర్ స్పేయర్లులను సబ్సిడీ పై అందజేసినట్లు తెలిపారు. మండపాక గ్రామంలో ముగ్గురు రైతులకు మూడు పవర్ టిల్లర్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, నియోజవకర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, ఎంపీటీసీలు సన్యాసిరావు, శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ ఎంవీ రమేష్, ఏవో కుసుమ, సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఐక్య పాస్టర్ల సంఘ నాయకులు


తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన పాస్టర్స్ సంఘ నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును శుక్రవారం అత్తిలి ఐక్య పాస్టర్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలవగా ఇటీవలు ఏర్పడ్డ నూతన కార్యవర్గానికి మంత్రి కారుమూరి శుభాకాంక్షలు తెలుపుతూ సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడు అగ్నిజ్యోల, సహాయ కార్యదర్శి వేణుబాబు, సహాయ కోశాధికారి అరుణ్‌కుమార్, పాస్టర్లు విజయ్‌కుమార్, సత్యానందం పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అండగా ఉంటా..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు అండగా ఉంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తణుకు రేషన్ డీలర్ల సంఘ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ మంత్రి కారుమూరి చొరవతో 2015 నుంచి 2023వ సంవత్సరం వరకు డీలర్లకు పెండింగ్‌లో ఉన్న ఎండీఎం, ఐసీడీఎస్‌లకు సంబంధించిన కమిషన్ విడుదలకు పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు రేషన్ డీలర్స్ సంఘ అధ్యక్షులు టీఎన్ రవికుమార్, వై.రమేష్, బి.అనంతలక్ష్మి, ఎం.ప్రసాద్, ఆర్ కుమార్‌రాజు, ఐ.సుబ్బరాజు, ఎస్.సూరిపండు, కె.శివ, వై.నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం పూజలు


ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కనకదుర్గమ్మ గుడిలో శ్రావణలక్ష్మి వ్రతాలలో పాల్గొన్న మహిళలు


అత్తిలిలో పసుపుకొమ్ములతో విశేష అలంకరణలో శ్రీవిజయచాముండేశ్వరి అమ్మవారు


ప్రత్యేక అలంకారంలో సర్వమంగళ అమ్మవారు

పెంటపాడు: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు వై. జంక్షన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శ్రావణలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు, ప్రత్తిపాడు కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతాలకు చుట్టుపక్కల 15 గ్రామాలతో పాటు, గూడెం, నిడమర్రు, గణపవరం మండలాల నుంచి 350 మంది మహిళలు పాల్గొని వరలక్ష్మి వ్రతాలు చేశారు. ఆలయ ఈవో బి. నీలకంతం, ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబుల ఆధ్వర్యంలో ప్రధానఅర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ మహిళలతో వరలక్ష్మి వ్రతాలను చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల వెంకటేష్, వీర్ల ధనరాజు, ఆలయ కమిటీ సభ్యులు జవ్వాది శేషగిరిరావు, తమ్మగంటి భాగ్యలక్ష్మి, నూనె శ్రీలక్ష్మి, మల్లిపూడి రత్నాకర్, కాసాని సరోజిని, శ్రీనివాస్, సిబ్బంది తాడిపర్తి వీరాస్వామి, మెగలపు పార్థసారది పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శంకరమఠంలో...

తాడేపల్లిగూడెం: స్థానిక శంకరమఠంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి, సర్వమంగళ అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సామూహిక సువాసినీ కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఓగేటిపండు, జోశ్యుల పాండురంగ శాస్త్రిలు పాల్గొన్నారు.

అత్తిలిలో: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అత్తిలి విజయచాముండేశ్వరి అమ్మవారిని పసుపుకొమ్ములతో విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కలగ కృష్ణవంశీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజాదికాలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ ఘటనకు న్యాయవాదుల నిరసన


తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై దాడిచేసిన పోలీసులను వెంటనే విధుల నుంచి బహిష్కరించాలని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ హాపూరులో న్యాయవాదులపై దాడిని ఖండిస్తూ తణుకు బార్ అసోసియేషన్ భవనం వద్ద శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ చట్టాల అమలుకు కృషి చేస్తున్న న్యాయవాదులపై పోలీసులు దాడిచేయడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, ఐలు తణుకు శాఖ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు నేతల సోమేశ్వరుడు, అనుకుల రమేష్, ఆర్.జనార్ధన్, ఎస్.లాజర్, ఆర్. శ్రీనివాస్, సీహెచ్ నాగేశ్వరరావు, వి.వెంకటేశం పాల్గొన్నారు.

పోలీసులపైచర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం: ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో న్యాయవాదులపై దాడిని ఖండిస్తూ గూడెంలోని న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. దాడులు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, జనరల్ సెక్రటరీ దాసం సునీల్, కోశాధికారి కొత్తపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: కుల, మత, ప్రాంతం, లింగభేదం లేకుండా ప్రజలంతా అక్షరాస్యులైతేనే దేశం అభివృద్ధి చెందుతుందని పెంటపాడు మండల విద్యాశాఖాధికారి-2 టీవీ రామకృష్ణ పేర్కొన్నారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్‌స్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో పాటు, ప్రతి కుటుంబం విద్యను అభ్యసిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం అక్షరాస్యత కోసం కోట్లాదిరూపాయాలు వెచ్చిస్తోందన్నారు. అందరూ విద్యావంతులై దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సీఆర్‌పీ వాసును ఈ సందర్భంగా ఎంఈవో టీవీఆర్కే ఆధ్వర్యంలో బేసిక్‌స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఇరగవరం: విద్యార్థులు క్రీడల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబర్చాలని కె ఇల్లిందలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి కిషోర్ కుమార్ తెలిపారు. మండలంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో వివిధ పాఠశాలల నుంచి 160మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు డివిజనల్ వ్యాయమ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎస్ ఆర్ అప్పారావు, మండల కో ఆర్డినేటర్ కెవిఆర్ సుబ్బరావు, వ్యాయమ ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, సంతోష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ తదితరులు

పెంటపాడు: ప్రజల ఆరోగ్యం కోసం ఈనెల 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సిబ్బంది విజయవంతం చేయాలని మండల తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీలు కోరారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీవో బాలాజీ అధ్యక్షతన జగనన్న ఆరోగ్యసురక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి నెలాఖరువరకు ప్రతీ ఇంటింటికీ తిరిగి అనారోగ్యంతో భాదపడుతుంటే వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అనారోగ్యవంతులను గుర్తించి 30న చేపట్టబోయే ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో ఉచిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించే కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తాతాజీ

తణుకు టౌన్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడుగా తణుకు పట్టణానికి చెందిన నార్ని వెంకట సుబ్బారావు (తాతాజీ) రెండవ సారి నియమితులైనట్లు తాతాజీ తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచి బీజేపీ పార్టీ కార్యకర్తగా కొనసాగిన 2019 వరకూ ఉమ్మడి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం విభజిత జిల్లాకు నూతన బీజేపీ అధ్యక్షుడుగా ఎన్నికై ఇప్పటి వరకూ కొనసాగారు. ప్రస్తుతం రెండవ సారి తాతాజీని జిల్లా అధ్యక్షునిగా కొనసాగిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉత్వర్వులు అందజేసినట్లు తెలిపారు.

వ్యవసాయ అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం


మండల ఏవో పార్థసారథిని సన్మానిస్తున్న వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ తదితరులు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని జిల్లా, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహామండలి పాలకవర్గ సమావేశం శుక్రవారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ఉన్నతి కోసం, సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పెట్టుబడి రాయితీ, కౌలు రైతులకు రుణాలు, వ్యవసాయ పనిముట్లు, గ్రూపులకు రుణాలు తదితర పథకాల ద్వారా ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రతీ మండలంలోనూ సలహామండళ్లను ఏర్పాటు చేసి అధికారుల సాయంతో వ్యవసాయాన్ని పండగ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించాయన్నారు. రైతుల కష్టాలను ఎరిగిన సీఎంగా ప్రతీ రైతు జగనన్నకు రుణపడి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇటీవల జిల్లా ఉత్తమ వ్యవసాయాధికారిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన పెంటపాడు ఏవో కె. పార్థసారధిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కునుకు పుల్లయ్య, బుద్దన చంటి, తోట నిరీక్షణరావు, గుండుమోగుల మునీంద్ర, జాలపర్తి నాగేశ్వరరావు, గోడే అనంతలక్ష్మి, తాడి నాగబాస్కరరావు తదితరులతోపాటు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట్రావు, సొసైటీల చైర్మన్‌లు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, వీఏఏలు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.